క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపులు తనిఖీ

మానవపాడు: మండల కేంద్రంలోని బుధవారం మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. పత్తి, మిరప విత్తనాలను, డీలర్ల లైసెన్సులు పరిశీలించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మణిప్రకాష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో రాజావీధిలోని భక్త మార్కండేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 50ఏళ్లు పూర్తయినా సందర్భంగా పద్మశాలి సేవా సంఘం, పద్మశాలి యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీకాంత్, శాంతరాం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అయిజ: మున్సిపాలిటీలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయ సమీపంలో బుధవారం విద్యుత్ స్తంభానికి ఉన్న తీగలు నడిరోడ్డుపై తెగిపడ్డాయి. ఆ సమయంలో ప్రజలు ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు అక్కడకు చేరుకుని ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేశారు. విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చి తెగిపడిఉన్న తీగలను తొలగింపజేశారు. కాలం చెల్లిన విద్యుత్ తీగలను తొలగించి కొత్తవి అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులను మున్సిపల్ వైస్ చైర్మన్ కోరారు.

రుణమాఫీ సంబరాలకు ఏర్పాట్లు

మానవపాడు: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బుధవారం రూ.లక్ష వరకు రుణమాఫీ గురువారం విడుదల చేస్తున్న సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం మానవపాడు, చెన్నిపాడు క్లస్టర్ల వారికి మండల కేంద్రంలోని రైతువేదికల వద్ద సంబరాలు నిర్వహిస్తున్నామని రైతులు హాజరుకావాలని తెలిపారు.
శాంతినగర్: రుణమాఫీ ప్రక్రియ గురువారం ప్రారంభమవుతున్న తరుణంలో కొంకల రైతు వేదికలో సాయంత్రం 4గంటలకు వీసీ తిలకించేందుకు రైతులంతా హాజరుకావాలని ఏఓ రాధ బుధవారం ప్రకటనలో కోరారు.

నిజమైన రైతులకు రుణమాఫీ



అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నెరవేర్చిందని పీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి రూ.28వేల కోట్లతో రుణమాఫీ మాత్రమే చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.31 వేల కోట్లతో రైతులకు పంటల రుణాలను మాఫీ చేస్తుందని తెలిపారు. రైతుల అభ్యున్నతి కోరి, రైతు సుస్థిరతకై నిజమైన రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండానే పాస్ బుక్కులు కలిగిన వారికి రుణమాఫీ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాణమ్మ, మద్దిలేటి, గాలిరెడ్డి, సురేష్ గౌడ్, ఫిరోజ్, సాంబశివుడు, జయన్న, మధుకుమార్, బసవరాజు, మేకలనాగిరెడ్డి, రంగు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దే..
అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌కే సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి రుజువు చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వేములశ్యామ్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల్లో హామీగా ఇచ్చిన 6 గ్యారంటీలను సీఎం అమలు చేశారని పేర్కొన్నారు. అందులో ప్రధానంగా ఉన్న రూ. 2 లక్షల రుణమాఫీని ప్రతి రైతుకు సీఎం వర్తింపజేసినట్లు తెలిపారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



నారాయణపేట రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో సిబ్బందికి బుధవారం నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఎండీ సజ్జనార్ ఏర్పాటుచేసిన లక్ష్యే లక్ష్యం చాలెంజ్‌లో పాల్గొని డ్రైవర్, కండక్టర్లు డిపోల ఆదాయం పెంచడానికి చేస్తున్న కృషిని గుర్తించి ప్రతినెల వారిని ఆహ్లాదంగా ఉంచడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు జూలై నెలకు గాను క్రీడాపోటీలు నిర్వహించారు. పురుషులకు పరుగుపందెం, మహిళలకు కుర్చీ ఆట, తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

ముగిసిన మొహర్రం



ఉండవెల్లిలో..



ఉండవెల్లిలో ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు



గట్టులో పీర్ల ఊరేగింపు

అలంపూర్ రూరల్: పట్టణం, మండలంలో మొహర్రం వేడుకలను 10 రోజుల పాటు నిర్వహించగా బుధవారంతో ముగిశాయి. ఉదయం గంధం, పెద్దలాలిసాబ్, భైరంపల్లి లాలీసాబ్ పీర్లు పట్టణ పురవీధులలో సవారి చేయించారు. భక్తులు పీర్లకు నివేదనలు, ప్రసాదాలతో ప్రార్థనలు చేయించి, తమ మొక్కులను తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో రోడ్లు కిక్కిరిశాయి. దుకాణా సముదాయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. కిచిడి పీరుది ఏటా ప్రత్యేకత సంతరించుకుంటుంది. పీరు సామగ్రిని తలపై పెట్టుకుని రోడ్డుపై అటు ఇటు తిరుగుతారు.

అయిజ: పట్టణంలోని వల్లూరుపేట, మద్దిగుంట, కోట్ల వీధుల్లో బుధవారం మొహర్రం పండుగను కుల మతాలకు అతీతంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీర్లకు ప్రత్యేక అలంకరణ చేసి పట్టణంలోని ప్రధానవీధుల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లిం మత పెద్దలు మొహర్రం విశిష్టతను వివరించారు. ఊరేగింపులో హిందువులు, ముస్లింలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కేటీదొడ్డి: మండలంలోని పాతపాలెం తదితర గ్రామాల్లో బుధవారం పీర్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గట్టు: మండలంలో మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మండల కేంద్రంలోని కమ్మరి వీధిలోని ఉన్న మసీదు నుంచి పీర్లను ఊరేగించారు. హజరత్ అలీ కుమారులు మహ్మద్ అసేన్, మహ్మద్‌హుస్సేన్‌లు కర్బాల యుద్ధంలో షహీద్ (అమరులు) అవుతారు. ఈ సందర్భంగా సంతాప దినాలుగా మొహరం నిర్వహిస్తారు. చివరి రోజున యుద్ధ భూమికి తరలి వెళ్తున్న వారికి ఘనంగా వీడ్కోలు పలికే సందర్భంలో పీర్ల ఊరేగింపును నిర్వహించారు. హిందూ, ముస్లింలు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

ధరూరు: మండలంలోని నెట్టెంపాడులో పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.

ఉండవెల్లి: మండల కేంద్రం, తక్కశీల, ప్రాగటూరు, మెన్నిపాడులో పీర్లను దర్గాల నుంచి ఊరేగింపు నిర్వహించారు.



అయిజలో..



అలంపూర్‌లో ఊరేగింపుగా వెళ్తున్న గాజుల పీరు



ధరూరు మండలం నెట్టెంపాడులో..



కేటీదొడ్డి మండలం పాతపాలెంలో పీర్ల ఊరేగింపు

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

గద్వాల రూరల్: బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న మల్దకల్ మండలం మల్లెందొడ్డి చెందిన లబ్ధిదారులకు మంజూరైనా చెక్కులను బుధవారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. ముగ్గురికి కలిపి రూ.51వేలు చెక్కులను అందజేసినట్లు వివరించారు. అదేవిధంగా సంగాలకు చెందిన రైతు రాజు కుటుంబానికి రైతు బీమా ద్వారా మంజూరైనా రూ.5లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాముడు తదితరులు ఉన్నారు.



గద్వాలలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

అంగన్‌వాడీ కేంద్రం కోసం వినతి
గద్వాల అర్బన్: మండలంలో చెనుగోనిపల్లి పరిధిలోని శెట్టి ఆత్మకూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు
మల్దకల్: మండలంలోని సద్దలోనిపల్లి కృష్ణస్వామి ఆలయంలో తొలిఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మొహర్రం పండుగ వేడుకలలో పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులందరికి వెంటనే పాఠ్య పుస్తకాలతోపాటు ఏకరూప దుస్తులను అందజేయాలని కోరారు. అయిజలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను, బీసీ బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచాలని, స్కావెంజర్, ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాఠశాలల్లో వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, గోపాల్, క్రాంతికుమార్, విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కస్తూర్బాలో సమస్యలు

- డ్రెయినేజీ లేకపోవడంతో భవనం పక్కనే మురుగు
- పాఠశాలకు వెళ్లేదుకు దారిలేక ఇబ్బందులు
- అసంపూర్తి పనులకే పరిమితం

ఉండవెల్లి: కస్తుర్బా గాంధీ పాఠశాల కొత్త భవన నిర్మాణం పూర్తయినా విద్యార్థులకు కష్టాలు మాత్రం తప్పట్లేదు. మండలంలోని కలుగోట్లలో 2021లో కస్తూర్బా గాంధీ విద్యాసంస్థల భవనం మంజూరైంది. భవన నిర్మాణాన్ని జనవరి 27న ప్రారంభించారు. పాఠశాలలో ప్రస్తుతం 240 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల భవనం నిర్మించడంతో అధిక సంఖ్యలో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించేందుకు ఇష్టపడుతున్నారు. భవనం నిర్మించినా అక్కడికి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. దారి పొడవునా గుంతలు, ముళ్ల పొదలు, అనేక ఇబ్బందులు ఎదుర్కొని పాఠశాలకు చేరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకోవాలని ఉపాధ్యాయులు, అధికారులకు కోరినట్లు తెలిపారు.

మురుగుతో విద్యార్థులకు వ్యాధులు..
భవనం వద్ద మురుగు చేరడంతో వ్యాధులు అధికంగా సంభవిస్తున్నాయి. పాఠశాల వెనుక భాగంలో నుంచి దుర్వాసన అధికంగా వస్తుంది. కనీసం మురుగు చేరే క్రమాన్ని మళ్లించాలని పాఠశాల ఎస్ఓ కలెక్టర్‌కు విన్నవించినా ఇంత వరకు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు తిరిగి వెళ్లిపోతారెమోనని ఉపాధ్యాయులు ఆలోచిస్తున్నారు. ప్రహరీ లేక పోవడంతో చుట్టు పక్కల గుట్టలు, పొదల నుంచి పాములు చేరుతున్నాయని వాపోతున్నారు.



కలుగోట్ల నుంచి కస్తూర్బాకు వెళ్లే మార్గం



కస్తూర్బా పాఠశాల వద్ద ఇరుకు దారి



పాఠశాల వద్ద పారుతున్న మురుగు

రహదారి లేక ఇబ్బందులు..



కలుగోట్లలో కస్తూర్బా పాఠశాలకు రహదారి లేక వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలను దాటి, గుట్టలను దాటి వెళ్తున్నాం. దయచేసి రోడ్డు వేయాలని కోరుతున్నాం.

– శ్రీనివాసులు, విద్యార్థిని తండ్రి, ఉండవెల్లి,

అధికారులకు విన్నవించాం

కస్తుర్బా పాఠశాల భవనం చాలా బాగుంది. చిన్న చిన్న పనులు ఉన్నాయి. మురుగు నిల్వ ఉండడంతో విద్యార్థులకు దోమలు బెడద అధికంగా ఉంది. ప్రహరీ ఏర్పాటు చేయాలి. ముందుగా రహదారి పనులు చేపట్టాలని కలెక్టర్‌కు తెలిపాం.

– పరిమళ, ఎస్ఓ, కలుగోట్ల, ఉండవెల్లి మండలం



అయిజ అంబభవాని ఆలయంలో..



మల్దకల్‌లో..

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

శాంతినగర్: ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేవారు. పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సామూహిక గోవిందనామస్మరణలు చేశారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. వడ్డేపల్లి మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు.

అయిజ: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం అర్చకులు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని అంబభవాని ఆలయంలో రుక్మిణీదేవి సమేత పాండురంగ స్వామికి పూజలు చేశారు.

మల్దకల్: ప్రధాన దేవాలయాల్లో భక్తులు తొలి ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీవెంకటేశ్వరస్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతారామస్వామి, చర్లగార్లపాడు వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి సతీమణి పద్మజ ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేశారు.



రాజోళిలో పూజలు చేస్తున్న భక్తులు

రాజోళి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా పూజలు నిర్వహించారు. చారిత్రాత్మక వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక భ్రమరాంబ అడివేశ్వర స్వామి, తుంగభద్ర నది మధ్యలో ఉన్న రాంపాటి శివాలయంలోని రామలింగేశ్వర ఆలయంలో భక్తులు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షతో స్వామి వారి సేవలో నిమగ్నమయ్యారు.



రామలింగేశ్వరస్వామికి హారతి ఇస్తున్న భక్తులు



శాంతినగర్‌లో వేంకటేశ్వరస్వామి విగ్రహం

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



గద్వాలలో అవగాహన కల్పిస్తున్న సంస్థ సభ్యులు



కేటీదొడ్డిలో ఎంవీఎఫ్ సభ్యుల ర్యాలీ

గద్వాల అర్బన్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, నిర్మూలిద్దామని కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ చంద్రశేఖర్ సూచించారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్‌లో, గంజిపేటలో బాలల హక్కులు, చట్టాలు, న్యాయం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ బాధ్యతలను విస్మరించారాదన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, లత, ధనలక్ష్మి, వార్డెన్ జ్యోతి తదితరులు ఉన్నారు.

కేటీదొడ్డి: బడి బయట పిల్లలందరూ బడిలో ఉండాలని సీఆర్‌పీఎఫ్ సభ్యుడు కిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బడి బయటి పిల్లలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. 6 నుండి 14 ఏళ్ల పిల్లలను పనులో పెట్టుకోవద్దని సీడ్ పత్తికి పిల్లలను పంపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదవుతాయన్నారు. కార్యక్రమంలో సవిత, సభ్యులు తదితరులు ఉన్నారు.

వర్షంతో రైతులకు ఊరట



కంది చేనులో కలుపు తీస్తున్న కూలీలు

గట్టు: వర్షాల కోసం ఎదురు చూసిన రైతులకు ఎట్టకేలకు వరుణుడు కరుణించడంతో పొలం పనుల్లో బిజీగా మారారు. వర్షాధారంగా మెట్ట భూముల్లో సాగు చేసిన వేరుశనగ, వరి, పత్తి, ఆముదాలు, కంది పంటలు వర్షాల్లేక వాడు ముఖంపట్టాయి. జూలై మాసం ప్రారంభం నుంచి చెప్పుకోదగ్గ వర్షం కురువలేదు. పంటలకు ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. ఈ వర్షంతో మెట్ట పంటలతో పాటుగా నీటి ఆధారంగా సాగు చేసుకున్న పత్తివిత్తనోత్పత్తి (సీడ్ పత్తి), దోసకాయ పంటలకు ఊరట లభించింది. గొర్తవరి వాడు పడుతున్న తరుణంలో ఈ వర్షంతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. రైతులు ఆయా పంటల్లో కలుపు నివారణ, ఎరువులను అందించే పనులు చేపడుతున్నారు. కూలీలకు చేతి నిండా పని దొరుకుతుంది. మరోవైపు ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి కాల్వకు నీటిని వదలడంతో దీని ఆధారంగా నాట్లు వేసుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు వరినారను చల్లుకోగా, మరి కొంత మంది నారను చల్లుకుంటున్నారు.

మందు బాబులకు అడ్డాగా రైతువేదిక

మానవపాడు: మండలకేంద్రంలోని రైతువేదిక మందు బాబులకు అడ్డగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కడ మద్యం తాగిన సీసాలు దర్శనమిస్తున్నాయి. రైతువేదిక చుట్టూ అపరిశుభ్రంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.